RNI No. APTEL/25/A3079

# మన బడి

## మాస పత్రిక

సంపుటి: 2 సంచిక: 4 మార్చి – 2026 పేజీలు: 24

समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్ష

# ఆరోగ్య చైతన్యం..వైద్య విజ్ఞానం











# నిజాయితీలో పిల్లలు 'బంగారం'



Post

Lokesh Nara
@naralokesh

X.com

Show translation

నిజాయితీలో మా పిల్లలు ``బంగారం ``

నిజాయితీ, నైతిక విలువలకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు మా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు. తిరుపతి జిల్లా, వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ గర్ల్స్ హైస్కూలులో చదువుతున్న మా పిల్లలు ``బంగారం`` అని నిరూపించుకున్నారు. గురువారం సాయంత్రం స్కూల్ విడిచిపెట్టగా వెంకటగిరి ఎస్బీఐ బ్యాంకు వద్ద మన్నవరం బస్సు కోసం నిరీక్షిస్తున్న కొత్తపల్లి గుంటకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు బి గురుప్రియ, బి గీతిక, ఎం గీతిక, 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీ , 7వ తరగతి విద్యార్థిని హేమలతలకు ఒక పర్సు కనిపించింది. పర్సు తీసి చూడగా బంగారం, నగదు. ఇంకో ఆలోచన లేకుండా అమ్మాయిలంతా పోలీస్ స్టేషన్ వైపు నడిచారు. ఎస్ఐ స్వరూపకు తమకు దొరికిన పర్సు అందజేసి, అభినందనలు అందుకుని ఇంటికెళ్లేందుకు బస్టాప్ వద్దకు వచ్చారు. అక్కడ ఓ మహిళ పర్సు కోసం వెతుకుతూ పిల్లల్ని అడిగింది. తమకే దొరికిందని, స్టేషన్‌లో ఇచ్చామని చెబుతూ ఆమెతో పాటు స్టేషన్‌కు వెళ్లారు పిల్లలు. నగలు, నగదు అమెవేనని నిర్ధారించుకున్న ఎస్ఐ ఆ మహిళకు అందజేశారు. చిన్నవయస్సులో మీ నీతివంతమైన ప్రవర్తన ఆదర్శంగా నిలిచింది చెల్లెమ్మలూ!. మీకు ఎల్లప్పుడూ అండగా ఉండే అన్నగా నేను గర్విస్తున్నాను. మీ నిజాయితీ మన విద్యాశాఖ గౌరవాన్ని మరింత ఇనుమడింపజేసింది. హృదయపూర్వక అభినందనలు చిట్టితల్లులూ..

నీతి నిజాయితీ గురించి చిన్న పిల్లలకు చాలా ఏళ్లుగా చెప్పే కథ పులి-ఆవు. అడవికి మేతకు వెళ్లిన ఆవుని పులి తినబోతే, తన దూడ ఆకలితో ఉందని, పాలిచ్చి వస్తానని వెళ్లిన ఆవు తిరిగి అడవికి పులి దగ్గరకి వస్తుంది. ఆవు నిజాయితీ మెచ్చుకున్న పులి వదిలేస్తుంది. నైతిక విలువలు, మాటకు కట్టుబడి ఉండటం, నిజాయితీ గురించి ఇకపై ఈ కథ బదులు తిరుపతి జిల్లా, వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ గర్ల్స్ హైస్కూలులో చదువుతున్న పిల్లలు `బంగారం` లాంటి నిజాయితీని చెబుదాం.

వెంకటగిరి జెడ్పీ హైస్కూల్ విడిచిపెట్టగా వెంకటగిరి ఎస్బీఐ బ్యాంకు వద్ద మన్నవరం బస్సు కోసం నిరీక్షిస్తున్న కొత్తపల్లి గుంటకు చెందిన 8వ తరగతి విద్యార్థినులు బి గురుప్రియ, బి గీతిక, ఎం గీతిక, 6వ తరగతి చదువుతున్న పద్మశ్రీ, 7వ తరగతి విద్యార్థిని హేమలతలకు ఒక పర్సు కనిపించింది. పర్సు తీసి చూడగా బంగారం, నగదు. ఇంకో ఆలోచన లేకుండా అమ్మాయిలంతా పోలీస్ స్టేషన్ వైపు నడిచారు. ఎస్ఐ స్వరూపకు తమకు దొరికిన పర్సు అందజేసి, అభినందనలు అందుకుని ఇంటికెళ్లేందుకు బస్టాప్ వద్దకు వచ్చారు. అక్కడ ఓ మహిళ పర్సు కోసం వెతుకుతూ పిల్లల్ని అడిగింది. తమకే దొరికిందని, స్టేషన్‌లో ఇచ్చామని చెబుతూ ఆమెతో పాటు స్టేషన్‌కు వెళ్లారు పిల్లలు. నగలు, నగదు అమెవేనని నిర్ధారించుకున్న ఎస్ఐ ఆ మహిళకు అందజేశారు. చిన్న చిన్న అవసరాల కోసం అబద్ధాలు ఆడే ఈ రోజుల్లో లక్షల విలువైన బంగారం, వేలల్లో నగదు దొరికితే..నిజాయితీగా తీసుకెళ్లి పోలీస్ స్టేషనులో అప్పగించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులను విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు పిల్లల నిజాయితీని మెచ్చుకుని చిరుసత్కారం చేశారు.








# మన బడి

## మాస పత్రిక



సంపుటి: 2 సంచిక: 4 మార్చి – 2026 పేజీలు: 24

**గౌరవ సలహాదారులు**
**కోన శశిధర్,** ఐ.ఎ.ఎస్.,
సెక్రటరీ, పాఠశాల విద్యాశాఖ
**విజయ రామరాజు.వి,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, పాఠశాల విద్యాశాఖ
**పి.రంజిత్ బాషా,** ఐ.ఎ.ఎస్.,
డైరెక్టర్, ఇంటర్మీడియెట్ విద్య
**ఎడిటర్**
**బి.శ్రీనివాసరావు,** ఐ.ఎ.ఎస్.,
స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్, సమగ్ర శిక్ష
**సలహాసభ్యులు**
**ఎం.ఆర్.ప్రసన్నకుమార్,** ASPD -1
**డి.దేవానందరెడ్డి,** సెక్రటరీ, KGBV
**డి.మధుసూదనరావు,** డైరెక్టర్, AP Text Books Press
**కె.నాగేశ్వరరావు,** అడిషనల్ డైరెక్టర్, SAMO
**కె.రవీంద్రనాథ్ రెడ్డి,** ASPD -2
**వి.మనోహర్ నాయక్,** CMO
**కె.జీవనజ్యోతి,** సూపరింటెండెంట్
**వర్కింగ్ ఎడిటర్**
**చల్ల మధుసూదనరావు,** మీడియా కన్సల్టెంట్
**అసిస్టెంట్ ఎడిటర్**
**గణపతి రావు బెహరా,** PRO
**ఎడిటోరియల్ కమిటీ**
**డా. ఎస్.వి. లక్ష్మణరావు,** టీఎస్‌జీ (సీఎంవో)
**పైడి.వెంకట రమణ,** సీనియర్ ప్రోగ్రామర్
**డా. కె.శారద,** శామో ఫ్యాకల్టీ
**డా. వి.సతీష్ రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. ఎస్.ప్రసాద్ రావు,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**జి. మహేశ్వర రెడ్డి,** సీమ్యాట్ ఫ్యాకల్టీ
**డా. టి.ఇస్మాయిల్,** దీక్ష కో ఆర్డినేటర్
**డా. కె.పెంచలయ్య,** టీఎస్‌జీ (ఆర్టీఈ)
**డా. వై.నరసింహం,** టీఎస్‌జీ(ఐఈ)
**పి.వెంకటేశ్వరరావు,** టీఎస్‌జీ (ప్లానింగ్)
**పి.గీత,** టీఎస్‌జీ(ఓఎస్‌సీ)
**డిజైనింగ్**
**గిరిధర్ అరసవల్లి**
**చిత్రకారులు**
**మల్లిక్**

*గుంటూరు వైద్య కళాశాలలో మూడు దశాబ్దాల తరువాత GMC MedFusion పేరుతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వైద్య విజ్ఞాన ప్రదర్శన సందర్శకులలో అతి ఎక్కువమంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే ఉండటం చాలా సంతోషం అనిపించింది. వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలు, ప్రజారోగ్య అవగాహన, శాస్త్రీయ అభ్యసనాలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఏర్పాటుచేసిన ఈ ప్రదర్శన విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన, వైద్యవిజ్ఞానం పెంపొందించడానికి దోహదపడింది.*

*విజ్ఞాన ప్రదర్శనలు విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనా శక్తిని పెంచి, నూతన ఆవిష్కరణలకు ప్రోత్సాహాన్ని ఇస్తాయి. ఎగ్జిబిషన్లలో చూసిన అంశాలను క్లిష్టమైన సైన్స్ భావనలను సులభంగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడతాయి. వైద్యవిజ్ఞాన ప్రదర్శన ద్వారా వైద్య విద్య పట్ల చిన్నప్పటి నుంచే గౌరవం పెంపొందుతుంది. సైన్సు పట్ల మరింత అవగాహన కలుగుతుంది. మూఢనమ్మకాలు పటాపంచలవుతాయి. శాస్త్రీయ దృక్పథం, ఆరోగ్య స్పృహ పెంచిన వైద్య విజ్ఞాన ప్రదర్శన నిర్వాహకులకు, విజయవంతం చేయడంలో కృషి చేసిన అందరికీ అభినందనలు.*

– **బి శ్రీనివాసరావు,** IAS
ఎడిటర్ & రాష్ట్ర పథక సంచాలకులు
సమగ్ర శిక్ష, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh.
K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P.
For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in,
Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed at **M/s. Lakshmi Vignesh Printers,** Guntur
ఆన్ లైన్ మ్యాగజైన్ కోసం: https://schooledu.ap.gov.in/ samagrashiksha/cse.ap.gov.in

# విద్యా విజయాలు

## లీప్.. సౌకర్యాల్లో టాప్..

### బెస్ట్ మోడల్ గా నిడమర్రు మోడల్ స్కూల్

**విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ చొరవతో ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలు**

విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ చొరవతో పల్లె విద్యకు కొత్త ఊపిరి పోస్తూ నిడమర్రు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మోడల్ స్కూల్ (లీప్ స్కూల్) గా తీర్చిదిద్దుతున్నారు. పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులు ప్రస్తుతం వేగంగా సాగుతుండగా, ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని విద్యాశాఖ అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం బేతపూడి, నీరుకొండ, కురగల్లు, నిడమర్రు, బాపూజీ నగర్, శిబిరం ప్రాంతాల నుంచి సుమారు 520 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుంటున్నారు. ఈ మోడల్ స్కూల్లో తరగతి గదులను అత్యాధునికంగా రూపొందిస్తున్నారు. గ్రీన్ బోర్డులు, చార్ట్ బోర్డులు, డిజిటల్ పాఠాల కోసం ఐఎఫ్ ప్యానెల్స్, మోడరన్ టేబుల్స్, చైర్లు



ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఫుట్ బాల్ కోర్టు, దాని చుట్టూ 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, ఏర్పాటు చేస్తున్నారు. హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ వంటి క్రీడలకు అనువైన మల్టీ స్పోర్ట్స్ ఇండోర్ స్టేడియం, సుమారు 400 మంది విద్యార్థులు వీక్షించగల యాంఫీ థియేటర్, సైన్స్ మ్యూజియం నిర్మిస్తున్నారు. భద్రత, సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి పర్యావరణ పరిరక్షణకు అనుగుణంగా పాఠశాల పరిసరాలను అభివృద్ధి చేయడంతో పాటు, 500 మందికి సరిపడే డైనింగ్ హాల్, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. భద్రత దృష్ట్యా పాఠశాల ప్రాంగణం చుట్టూ 40 సీసీ కెమెరాలు అమర్చనున్నారు. ఏ-బ్లాక్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి విద్యార్థుల కోసం 28 గదులు, ప్రిన్సిపల్ రూమ్, స్టాఫ్ రూమ్ ఏర్పాటు చేశారు. బీ-బ్లాక్లో 9వ తరగతి నుంచి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 12 తరగతి గదులు ఉండగా, మరుగుదొడ్ల సౌకర్యాన్ని కూడా కల్పించారు. ఒకటి, రెండో తరగతి చిన్నారులకు చదువుపై ఆసక్తి పెరిగేలా గోడలపై ఆకర్షణీయమైన బొమ్మలు వేయించారు. ఇంటర్నేషనల్ ప్రమాణాలతో ఫిజిక్స్, బయాలజీ బ్లాక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ ల్యాబ్లు, అటల్ టింకరింగ్ ల్యాబ్, గ్రంథాలయం అందుబాటులోకి రానున్నాయి. పండ్లు, కూరగాయల మొక్కలతో కిచెన్ గార్డెన్, ప్రత్యేక పార్కింగ్ స్థలం, చిన్నారుల కోసం ఏడు రకాల ఆట పరికరాలతో చిల్డ్రన్స్ పార్క్ అధ్యాపకులకు లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తున్నారు. మొత్తం 5.02 ఎకరాల విస్తీర్ణంలో రూ.16 కోట్ల నిధులతో ఈ మోడల్ స్కూల్ ని పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తున్నారు.

## నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ లో గాలివీడు విద్యార్థి ఘనత



### రాష్ట్ర స్థాయిలో బి.నిహారికకు రెండో ర్యాంక్

జాతీయ స్థాయి పోటీ పరీక్షలో గాలివీడు మండలానికి చెందిన విద్యార్థిని తన ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో మెరిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షలో గాలివీడు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయానికి చెందిన బి.నిహారిక రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న పరీక్షా నిర్వహణ సంస్థ కార్యాలయంలో పరీక్షల సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ ద్వి ఫలితాలను అధికారికంగా ప్రకటించారు. రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన బి. నిహారికకు ..... తేదీన హైదరాబాద్ లోని త్యాగరాయ గానసభ లో ఘనంగా పురస్కార ప్రదానం జరిగింది.




కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా నిహారికకు నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ప్రిన్సిపల్ పుష్ప మనబడితో మాట్లాడుతూ నిహారిక సాధించిన ఈ విజయం తమ పాఠశాలకు, బోధనా సిబ్బందికి ఎంతో గర్వకారణమన్నారు.

## విద్యార్థులే పాత్రధారులు..

### ఆటలు.. పాటలే పాఠాలు

ఆకర్షించే బొమ్మలతో తరగతి.. తల్లి ఒడి లాంటి లాలనతో.. పిల్లల్లో ఉత్సాహం, సమాజంలో చైతన్యం నింపేలా బోధన సాగిస్తున్నారు గాండ్లపెంట ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు హలీమ. సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దడానికి తరగతి గదిలో సులభంగా అర్థమయ్యే, నాణ్యమైన బోధన సాగాలని ఆమె చెబుతున్నారు. అందుకు తాను పాటించే పద్ధతులను ఇలా వివరించారు.

### బోధనకు లోకాస్ట్, నోకాస్ట్ వస్తువులు

ఉపాధ్యాయురాలు హలీమ బోధనకు లోకాస్ట్, నోకాస్ట్ వస్తువులను ఉపకరణాలుగా వినియోగిస్తున్నారు. పిల్లలకు దృశ్య, ఆటపాటల అభినయంతో బోధిస్తున్నారు. పాఠశాలంటే ఆటవిడుపును తలపించేలా పాఠాలు చెబుతున్నారు. భూమిపై జంతు, వృక్షాలు, మనుషులు వంటి ప్రాణులకు సూర్యరశ్మి ఎలా ఉపయోగపడుతుందో విద్యార్థులే పాత్రధారులుగా



అభినయంతో అంశాలను నేర్పుతున్నారు. ఇందుకు తక్కువ ఖర్చు, పరిసరాల్లో ఉచితంగా లభించే వస్తువులతో బొమ్మలను చేసి తరగతిలో ప్రదర్శిస్తున్నారు. ద్విత్వ, సంయుక్తాక్షరాలతో స్వీయ రచనలతో కథలను అల్లి చదివించటంతో సులభంగా నేర్చుకునేలా కృషి చేస్తున్నారు.

## డ్రాపౌట్స్ లేకుండా తల్లిదండ్రుల్లో చైతన్యం

పాఠశాలలో విద్యార్థులు దీర్ఘకాలిక గైర్హాజరు, మధ్యలో బడి మానేయడంతో పాటు ప్రభుత్వ బడికి వచ్చేలా చేయటంపై ఉపాధ్యాయురాలు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. తరచూ తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. విద్యార్థి శారీరక, మానసిక, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధిపై అవగాహన కల్పిస్తున్నారు.

## కోసిగి కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ

### ఆటల్లో చిచ్చర పిడుగులు

కోసిగి కస్తూర్బా పాఠశాల విద్యార్థినుల ప్రతిభకు కొదవలేదు. వారి ఆటకు తిరుగులేదు. మైదానంలో అడుగు పెడితే పతకం వచ్చి వాలాల్సిందే. సాధించాలన్న పట్టుదల, నిత్య సాధన ఉంటే.. గెలుపు పరుగెత్తుకుంటూ వస్తుందని నిరూపిస్తున్నారు కోసిగి కేజీబీవీ విద్యాలయం బాలికలు. విలువిద్య, ఖోఖో, నెట్



బాల్, త్రో బాల్, సైకిల్ పోలో, కబడ్డీ, ఆట్యాపాత్యా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడల్లో ప్రతిభ చూపి గుర్తింపు తెస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయిని సుమ శిక్షణ, పాఠశాల ప్రిన్సిపల్ షబానా ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొంటూ... పతకాలు సొంతం చేసుకుంటున్నారు.

## హేమవతి.. తప్పదు గురి



కోసిగి గ్రామానికి చెందిన డి. హేమవతి కేజీబీవీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. తండ్రి. నారాయణ లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నారు. తల్లి మంగమ్మ ఇంటి పనులు చేస్తుంటారు. తల్లిదండ్రుల కష్టం కళ్లారా చూస్తూ.. వారి ఆశలకు అనుగుణంగా చదువుతోంది. విలువిద్య, ఖోఖో ఆటంటే ఆసక్తి. వ్యాయామ ఉపాధ్యాయిని సుమ నేతృత్వంలో క్రీడల్లో శిక్షణ తీసుకుంటూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడల్లో రాణిస్తుంది. కర్నూలులో నిర్వహించిన జిల్లా విలువిద్య రెండో స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఖోఖోలో రెండు సార్లు, కబడ్డీలో రెండు సార్లు ప్రతిభ చాటి పతకాలు సొంతం చేసుకుంది. క్రీడా కోటలో పీఈటీ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది హేమవతి.

## విజయాల లూసమ్మ

లూసమ్మ ఎనిమిదో తరగతి చదువుతోంది.



సాతనూరు (కొట్టాలు) స్వగ్రామం. తల్లిదండ్రులు అరుణ్, లలితమ్మ వలస కూలీలు. బెంగళూరులో కూలిపనులు చేస్తున్నారు. లూసమ్మ కు చిన్నప్పట్నుంచి క్రీడలంటే ఆసక్తి. నెట్ బాల్, షూటింగ్ బాల్, త్రోబాల్ క్రీడల్లో తన ప్రతిభ చాటుతోంది. మండల స్థాయిలో ప్రథమ స్థానం, జిల్లా స్థాయిలో మూడు సార్లు ఆడి ప్రతిభ చాటి.. రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. మెలకువలతో తన ప్రత్యేకతను చాటి,ప్రశంసాపత్రాలు అందుకుంది. షూటింగ్ బాల్ జిల్లా స్థాయిలో ప్రతిభచాటి కోసిగి కేజీబీవీ జట్టు మూడో స్థానంలో నిలిచేందుకు కీలకంగా వ్యవహరించింది లూసమ్మ. త్రోబాల్ జిల్లా స్థాయిలో రెండు సార్లు ప్రతిభ కనబరిచింది. ఆటల పై మరింత పట్టు సాధించి, పి.ఈ.టి ఉద్యోగం సాధిస్తానని చెబుతోంది లూసమ్మ.

## శృతి.. సైకిల్ పోల్లో మేటి

చదువుతో పాటు సైకిల్ పోల్ ఆటలో రాణిస్తోంది



శృతి హాసిని. ఎనిమిదో తరగతి చదువుతోంది. పెద్దకడుబూరు మండలం మెకడోన స్వగ్రామం. తల్లిదండ్రులు యోగేంద్ర స్వామి, సుగుణ. తండ్రి ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నారు. క్రీడల పై ఆసక్తి ఉన్న శృతి సైకిల్ పోల్, ఆట్యాపాత్యా ఆటలపై శిక్షణ తీసుకుంది. సైకిల్ పోల్ ఆటలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి పతకాలు పొందింది. ఆ ఆట్యాపాత్యా లో కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయిలో మూడు సార్లు ఆడి జట్టును ముందుకు నడిపింది. ప్రత్యేక గుర్తింపు సాధించడమే తన లక్ష్యమని చెబుతోంది శృతిహాసిని.

## ఈ వీల్ చైర్ ఉంటే.. ప్రత్యేక అవసరాల గల వారి జీవనం సులువిక

సరిగా నడవలేని వృద్ధులు, దివ్యాంగులు వీల్ చైర్ వాడటాన్ని మనం చూస్తూనే ఉంటాం. ఈ తరహా సాధారణ వీల్ చైర్ ఉపయోగించేవారు తప్పనిసరిగా ఒకరి సాయం తీసుకోవా ల్సిందే. అయితే మరో మనిషి సాయం లేకుండా దివ్యాంగుల జీవన ప్రయాణాన్ని మరింత సులభం చేసేలా 'స్మార్ట్ మల్టీపర్పస్ చైర్'ను పాఠశాల విద్యార్థులు రూపొందించారు. మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గంలోని చింతక్రింది కనకయ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎం. మాన్యశ్రీ. ఎ.కౌశిక్ లు ఉపాధ్యాయుడు బి. బైటస్ పర్యవేక్షణలో దీన్ని తయారుచేశారు. ఇది సోలార్ తో నడుస్తూ అవసరమైతే స్ట్రెచర్లా మారిపోతుంది. ఈ వైర్లో కూర్చున్న వ్యక్తిలో చలనం లేకుంటే వెనుక దిండులో ఉండే బజర్ మోగుతుంది. అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ఆక్సిజన్ అందించేలా సిలెండర్ ఉంటుంది. మలమూత్రవిసర్జనకు సైతం సీటు కిందనే ఏర్పాటు చేశారు. ఏదైనా తినడానికి వీలుగా చిన్నబల్ల. పక్కనే గ్లాస్ పెట్టగానే ఆటోమేటిక్ గా తాగునీరు నింపేలా ఏర్పాటు, చేతులు కడుక్కోవడానికి చిన్న ట్రే, సెల్ ఫోన్ చార్జింగ్, ఫ్యాన్, లైట్ ఇలా ఒకటేమిటి అన్ని రకాల సదుపాయాలు అమర్చారు. ఎవరైనా వీరి నిస్సహాయతను గమనించి దాడి చేయడానికి వస్తే తక్కువ స్థాయిలో ఎలక్ట్రిక్ షాక్ ఇచ్చేలా చేతికర్ర కూడా తయా రుచేశారు. దివ్యాంగుల రోజువారీ అవసరాలు, భద్రతను దృష్టిలో పెట్టుకొని చేసిన ఈ ఆవిష్కరణ విద్యార్థుల సృజనాత్మకతకు నిదర్శనంగా నిలుస్తోంది.

సేకరణ: **అమలాపురపు దుర్గాప్రసాద్**



# అక్షరాల వెలుగు నుంచి అంతరిక్షం వరకు



## గిరిజన గూడెం నుంచి జిల్లా సైన్స్ సెంటర్ వరకు

ప్రతిష్ఠాత్మక **‘శిక్షాగ్రహ లీడర్ షిప్ అవార్డు’** అందుకున్న **సుబ్రహ్మణ్యం.**

గ్రామీణ ప్రాంతాల్లో విజ్ఞాన విద్యను ప్రజలకు చేరువ చేస్తూ మూడు దశాబ్దాలుగా అంకితభావంతో పనిచేస్తున్న నెల్లూరే జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్ ఎన్. సుబ్రహ్మణ్యం జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకమైన “శిక్షాగ్రహ లీడర్‌షిప్ అవార్డు” అందుకున్నారు. ఈ అవార్డుతోపాటు ప్రశంసాపత్రం, విద్యా కార్యక్రమాల విస్తరణ కోసం రూ.10 లక్షల ఆర్థిక ప్రోత్సాహం ప్రకటించారు.

దేశవ్యాప్తంగా 6,500 మంది ఉపాధ్యాయులలో నాయకత్వ లక్షణాలు, సామాజిక ప్రభావం, గ్రామీణ విద్యాభివృద్ధికి చేసిన కృషి ఆధారంగా కేవలం ముగ్గురినే ఎంపిక చేయగా, అందులో సుబ్రహ్మణ్యం ఒకరుగా నిలవడం విశేషం. ఈ అవార్డును ఎస్.డి. శిబులాల్ గారు (Founder, ShikshaLokam; Co-founder, Infosys), శ్రీమతి కుమారి శిబులాల్ (Founder & Chairperson, The Shibulal Family Philanthropic Initiatives), చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమానికి సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు I.A.S హాజరయ్యారు.

***

‘సైన్స్ అంటే ఏవో క్లిష్టమైన, కష్టమైన సూత్రాలు



కాదు.. అది ఒక అన్వేషణ, ఒక జీవన విధానం!’ అని నమ్మి, మారుమూల పల్లెల్లోని పేద విద్యార్థుల్లో వైజ్ఞానిక స్పృహను రగిలిస్తున్న ఒక అరుదైన ఉపాధ్యాయుడి కథ ఇది.

ఒకప్పుడు నెల్లూరు జిల్లాలోని మారుమూల యానాది గూడెంలో పుట్టి, సరైన వనరులు లేని బాల్యంలో ఆకాశంలోని నక్షత్రాలను చూసి మురిసిపోయిన ఒక బాలుడు.. నేడు వేలాది మంది విద్యార్థులకు ఆ నక్షత్రాలను 'టెలిస్కోప్' ద్వారా చూపిస్తూ, వారి కలలకు రెక్కలు తొడుగుతున్నారు. నెల్లూరు జిల్లాలో సామాన్య గ్రామీణ విద్యార్థుల పాలిట విజ్ఞాన శాస్త్ర వెలుగులు పంచుతున్నారు.

### కష్టాల నుంచి పుట్టిన ఆశయం

ఎన్.సుబ్రహ్మణ్యం బాల్యం సౌకర్యాలకు ఆమడ దూరంలో గడిచింది. సరైన పాఠశాల లేకపోయినా, ఆకాశంలోని నక్షత్రాలను, ప్రకృతిలోని వైవిధ్యాలను చూసి ఆయనలో కలిగిన జిజ్ఞాస నేడు ఆయనను ఈ స్థాయికి చేర్చింది. ‘గ్రామీణ విద్యార్థులు వనరులు లేక



సైన్స్‌కు దూరం కాకూడదు' అనే బలమైన ఆశయమే ఆయనను ఉపాధ్యాయుడిగా మార్చింది. విజ్ఞాన శాస్త్రం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకూడదని, అది సామాన్య గ్రామీణ విద్యార్థికి కూడా అందుబాటులోకి రావాలని నిరంతరం శ్రమించారు.

## శ్రమకు ఫలితాలు ఇవీ..

సుబ్రహ్మణ్యం కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా, విద్యార్థుల ఆలోచనా విధానాన్ని మార్చేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత మూడేళ్లలో (2023 నుండి 2025 వరకు) సుబ్రహ్మణ్యం కృషి అద్భుతమైన ఫలితాలు ఇచ్చిందనడానికి నిదర్శనాలు ఇవే..

## మొబైల్ సైన్స్ ల్యాబ్ (ఇంటి ముంగిటకే విజ్ఞానం)

గ్రామీణ పాఠశాలల్లో ప్రయోగశాలలు ఉండవు. అందుకే సుబ్రహ్మణ్యం తన సొంత ఖర్చులతో ఒక వాహనాన్ని 'మొబైల్ సైన్స్ ల్యాబ్' (స్పేస్ ఆన్ వీల్స్) గా మార్చారు. అందులో సూక్ష్మదర్శిని (Microscope), టెలిస్కోప్ , విజ్ఞాన నమూనాలను ఉంచి, పల్లె పల్లెకు తిరుగుతూ పిల్లలకు సైన్స్‌ను చేరువ చేస్తున్నారు. ఈ బస్సును రెయిన్ బో సిబిఎస్ఈ స్కూల్ యాజమాన్యం పద్మ సుబ్రహ్మణ్యం విరాళంగా ఇవ్వగా, ఎమ్మెల్సీ శ్రీ బీద రవిచంద్ర గారు బస్సు నిర్వహణకు అండగా నిలిచారు.

## జిల్లా సైన్స్ సెంటర్ (చెముడుగుంట) – నూతన రూపకల్పన

సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు సుబ్రహ్మణ్యం నిరంతర కృషిని గుర్తించి, ఆయనను నెల్లూరు చెముడుగుంట జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్‌గా నియమించారు.




ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో ఈ కేంద్రం నేడు విజ్ఞాన భాండాగారంగా విరాజిల్లుతోంది. 2022లో జిల్లా సైన్స్ సెంటర్ క్యూరేటర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత, ఆయన ఆ కేంద్రానికి కొత్త ప్రాణం పోశారు.

* 56 వినూత్న ప్రదర్శనలు: ఇండోర్, అవుట్‌డోర్ ఎగ్జిబిట్‌లను పునరుద్ధరించి, వాటికి QR కోడ్‌లు, వీడియో వివరణలను జత చేశారు.

* ఆస్ట్రో టూరిజం (Astro tourism): రాత్రి వేళ టెలిస్కోప్ ద్వారా గ్రహాలు, నక్షత్రాలను చూపించడం, చంద్రుని ఉపరితలాన్ని టెలిస్కోప్ ద్వారా మ్యాపింగ్ చేయడం వంటివి సామాన్య ప్రజలను సైతం ఆకర్షిస్తున్నాయి. ఆస్ట్రో టూరిజం కార్యక్రమం ద్వారా 50,000 పైగా విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

* నెలకు కనీసం 15 పాఠశాలల విద్యార్థులు సైన్స్ సెంటర్‌ను సందర్శిస్తున్నారు. దాదాపు 450పైగా స్కూల్ విద్యార్థులు సందర్శించారు.

* కాస్మోస్ డిజిటల్ లెర్నింగ్: నీల్ డిగ్రేస్ టైసన్ వంటి ప్రముఖ శాస్త్రవేత్తల డాక్యుమెంటరీల ద్వారా అంతరిక్ష రహస్యాలను బోధించడం.

* కన్‌స్ట్రక్టివిస్ట్ టీచింగ్: విద్యార్థులే స్వయంగా ప్రయోగాలు చేస్తూ నేర్చుకునేలా ప్రోత్సహించడం.

* STEM ఆధారిత ప్రయోగాత్మక అభ్యాసం అమలు చేయడం.





## 'బడ్డింగ్ సైంటిస్ట్స్' విజయాలు

సుబ్రహ్మణ్యం నేతృత్వంలో 'బడ్డింగ్ సైంటిస్ట్స్' సాధించిన విజయాలు నెల్లూరు జిల్లా విద్యా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవి. మరెంతోమంది గ్రామీణ విద్యార్థులకు ఈ ప్రయాణం ఒక గొప్ప స్ఫూర్తి!

* గత దశాబ్ద కాలంగా నెల్లూరు జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి సైన్స్ ప్రదర్శనలలో (NCSC, INSPIRE) మెరిసి, జిల్లా కీర్తిని దశదిశలా చాటారు.
* నెలకు120 మందికి పైగా విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సుబ్రహ్మణ్యం శిక్షణలో 10 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి, 30 మంది రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్లకు ఎంపికయ్యారు.
* 2010లో వి.ఈ.ఎల్.ఎస్ యూనివర్సిటీ, చెన్నైలో జరిగిన 18వ నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ (NCSC) లో బి. దివ్య బృందం (పి.వి. లావణ్య, ఎస్. మహేష్, కె. అజంతా, బి. స్రవంతి) పాల్గొంది. 'వరి సాగులో జీవ ఎరువుల (Rhizobium, Azospirillum) ప్రభావం'పై వారు చేసిన పరిశోధన జాతీయ స్థాయి ప్రశంసలు అందుకుంది.
* 2014 (బెంగళూరు)లో జరిగిన 22వ ఎన్.సి.ఎస్.సిలో తరుణవాయు జెడ్.పి.హెచ్ పాఠశాలకు చెందిన జె. భార్గవ్ సుస్థిర అభివృద్ధిపై తన ప్రాజెక్టును ప్రదర్శించి, జాతీయ శాస్త్రవేత్తల మన్ననలు పొందారు.

## ఇన్‌స్పైర్ (INSPIRE) అవార్డ్స్:

* కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ (DST) నిర్వహించే ప్రతిష్ఠాత్మక 'ఇన్‌స్పైర్' అవార్డులలో 2011,2014,2015, 2016 సంవత్సరాల్లో సుబ్రహ్మణ్యం శిష్యులు జాతీయ స్థాయి విజేతలుగా నిలిచారు.

## దక్షిణాది రాష్ట్రాల సైన్స్ ఫెయిర్ (2012)

* హైదరాబాద్‌లోని సెయింట్ పాట్రిక్స్ హైస్కూల్‌లో 2011లో జరిగిన రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీల్లో, బెంగళూరులోని విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నాలజికల్ మ్యూజియంలో జరిగిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ – 2012 లో విద్యార్థులు సత్తా చాటారు.

## భవిష్యత్ లక్ష్యం

"ప్రతిష్ఠాత్మక 'శిక్షాగ్రహ అవార్డు'కు ఎంపికైనట్లు ప్రకటించడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అభిరుచి పెరిగేలా కృషి చేస్తాను. మారుమూల గిరిజన ప్రాంతాల్లో 'రూరల్ చిల్డ్రన్ రీసెర్చ్ సెంటర్' ను పునరుద్ధరించడం, సైన్స్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని మరింత విస్తరించడం నా భవిష్యత్తు లక్ష్యం. ప్రతి గ్రామీణ విద్యార్థి తనను తాను ఒక శాస్త్రవేత్తగా భావించాలి. అప్పుడే దేశాభివృద్ధి సాధ్యం అనేది నా నమ్మకం. నా విజయాలకు అనునిత్యం ప్రోత్సహిస్తున్న పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు నా ధన్యవాదాలు.

*– ఎన్. సుబ్రహ్మణ్యం, క్యూరేటర్, జిల్లా సైన్స్ సెంటర్, చెముడుగుంట, నెల్లూరు*

వెబ్సైట్: https://subrahmanya-work.netlify.app/

***– గణపతిరావు బెహరా,*** *PRO సమగ్ర శిక్ష*






# సానా సతీష్ బాబు ఫౌండేషన్

## "చిన్నారి కంటి సంరక్షణ" కార్యక్రమం





ఏలూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు, కళ్లజోడుల పంపిణీ

సానా సతీష్ బాబు ఫౌండేషన్ – ఏలూరు బృందం ఆధ్వర్యంలో "చిన్నారి కంటి సంరక్షణ – చిన్నారి చూపు రక్షణ" అనే విస్తృత స్థాయి బాలల కంటి ఆరోగ్య కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమయానికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ కంటి పరీక్షల కార్యక్రమం 25 అక్టోబర్ 2025న ప్రారంభమైంది. వైద్య బృందాలు ఏలూరు నియోజకవర్గంలోని 60 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించాయి. ఈ కార్యక్రమం ద్వారా 11,000 మందికి పైగా విద్యార్థులను పరీక్షించి వారి చూపు సంబంధిత సమస్యలను గుర్తించారు.

వివరమైన వైద్య పరీక్షల అనంతరం 2,350 మంది విద్యార్థులకు చూపు సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి కళ్లజోడు అవసరమని నిర్ధారించారు. విద్యార్థుల చదువుపై ప్రభావం పడకుండా ఉండేందుకు సానా సతీష్ బాబు ఫౌండేషన్ వారు ఈ విద్యార్థులందరికీ ఉచితంగా నాణ్యమైన కళ్లజోడులు ఏర్పాటు చేసింది.


### కళ్లజోడుల పంపిణీ కార్యక్రమం

ఈ కళ్లజోడుల పంపిణీ కార్యక్రమం 12 మార్చి 2026న ఏలూరులోని కస్తూరిబా మునిసిపల్ హై స్కూల్లో నిర్వహించారు. "Little Eyes Care" కార్యక్రమం భాగంగా విద్యార్థులకు కళ్లజోడులను పంపిణీ చేశారు.

### కార్యక్రమ ప్రభావం

"Little Eyes Care" కార్యక్రమం ద్వారా పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధి పట్ల ఫౌండేషన్ ఉన్న కట్టుబాటు స్పష్టంగా కనిపిస్తుంది. చిన్న వయస్సులోనే చూపు సమస్యలను గుర్తించి ఉచితంగా కళ్లజోడులు అందించడం ద్వారా విద్యార్థులు సౌకర్యంగా చదువుకోవడమే కాకుండా, వారి విద్యా ప్రగతికి, ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు ఈ కార్యక్రమం ఎంతో తోడ్పడుతోంది.








# అక్షర సేద్యంతో ప్రభుత్వ బడికి కొత్త కళ

పిల్లల కోసం 4 కంప్యూటర్లు, డిజిటల్ క్లాస్ రూమ్, ఐ.ఎఫ్.పి (IFP) డిజిటల్ లైబ్రరీని ఏర్పాటు చేశారు.

* **పర్యావరణం:** పాఠశాల ఆవరణలో 100కు పైగా మొక్కలు నాటడమే కాకుండా, ఒకప్పుడు డ్రైనేజీ/డంపింగ్ యార్డుగా ఉన్న ప్రదేశాన్ని పచ్చని కిచెన్ గార్డెన్‌గా మార్చారు.
* **జ్ఞాన గ్యాలరీ:** విద్యార్థుల్లో స్ఫూర్తి నింపడానికి 74 మంది శాస్త్రవేత్తలు, స్వాతంత్ర్య సమరయోధుల ఫోటోలతో ఒక గ్యాలరీని ఏర్పాటు చేశారు.

సొంత లాభం కొంత మానుకుని పొరుగువాడికి తోడ్పడమన్నారు మహాకవి గురజాడ అప్పారావు. ఈ మాటను అక్షరాలా నిజం చేస్తూ, తన సొంత నిధులతో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలనే మార్చేశారు ఒక ఉపాధ్యాయుడు. ఆయనే జగ్గంపేట మండలం గుర్రప్పాలెంకు చెందిన పడాల వీర వెంకట సత్యనారాయణ మాస్టారు.

రైతు బిడ్డ నుండి విద్యా ప్రదాతగా.. పడాల సూర్యనారాయణ, గంగారత్నం దంపతులకు జన్మించిన సత్యనారాయణ సామాన్య వ్యవసాయ కుటుంబం నుండి వచ్చారు. 2002లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన ఆయన, 24 ఏళ్లుగా విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతున్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్ గా కాండ్రేగుల, మామిడాడ వంటి ప్రాంతాల్లో పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారు.

## సగరపేట బడిలో విద్యా విప్లవం

2025 జూన్‌లో కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం, సగరపేట మోడల్ ప్రైమరీ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలనే పట్టుదలతో ఆయన పనిచేస్తారు.


సొంత నిధులతో అద్భుత మార్పులు: పివి మాస్టారు బోధనకే పరిమితం కాకుండా, 10 లక్షల రూపాయల తన సొంత నిధులు, దాతల నుండి 1.80 లక్షల విరాళాలు సేకరించి పాఠశాలలో అనేక మార్పులు చేశారు.

* **మౌలిక సదుపాయాలు:** క్లాస్ రూమ్‌లు, గ్రౌండ్‌లో టైల్స్ వేయించడంతో పాటు, తరగతి గదులను ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్స్‌తో తీర్చిదిద్దారు.
* **సాంకేతిక విద్య:** 1 నుండి 5 తరగతుల

## పెరిగిన ఆదరణ – మారిన ఫలితాలు

సత్యనారాయణ మాస్టారి కృషితో విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులు, కాపీ రైటింగ్ బుక్స్ అందించడమే కాకుండా, ప్రతి నెలా 'గ్రాండ్ టెస్టులు' నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందిస్తున్నారు. తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగి, స్కూల్ రోల్ 65







నుండి 87కి చేరింది. వచ్చే విద్యా సంవత్సరం కోసం ఇప్పుడే మరో 64 మంది విద్యార్థులు చేరడానికి ఆసక్తి చూపడం ఆయన సాధించిన విజయం.

ఈ పాఠశాల అభివృద్ధిలో ఆయనకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. హరిబాబు, తోటి ఉపాధ్యాయులు వై. రామమూర్తి, పి. శిల్ప, బి. దుర్గాభవాని సహకరించారు. ఉపాధ్యాయ వృత్తి పట్ల తనకి ఉన్న అంకితభావంతో ప్రభుత్వ విద్యారంగానికి పివి మాస్టారు ఆదర్శంగా నిలుస్తున్నారు.

## విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు


పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సత్యనారాయణ మాస్టారుని విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ తన సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రశంసించారు. దాదాపు 10 లక్షల సొంత నిధులు, దాతల నుండి 1.80 లక్షలతో కార్పొరేట్ స్కూలుని తలదన్నేలా తీర్చిదిద్ది ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

– **అమలాపురపు దుర్గాప్రసాద్,** జర్నలిస్టు


Lokesh Nara
@naralokesh

కాకినాడ జిల్లా, జగ్గంపేట మండలం సగరపేటలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పి.వి.వి. సత్యనారాయణ మాస్టారు బడి బాగు కోసం చేస్తున్న కృషి అభినందనీయం. సొంత నిధులు దాదాపు రూ.10 లక్షలు, దాతల విరాళాలు రూ.1.80 లక్షలతో కార్పొరేట్ స్కూలుని తలదన్నేలా తీర్చిదిద్ది స్ఫూర్తిగా నిలిచారు. క్లాసు రూమ్ లో టైల్స్, గ్రౌండ్ ఫ్లోరింగ్, పెయింటింగ్, వాల్ రైటింగ్, కాంపౌండ్ వాల్ రంగులతో కొత్తందాలు సంతరించుకునేలా చేశారు. నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్ రూం, కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయడం ప్రశంసనీయం. పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు సహకారంతో వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్. ఈ పాఠశాల అభివృద్ధికి అన్నివిధాలా సహాయం అందిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను.









# ఆరోగ్య చైతన్యం..వైద్య విజ్ఞానం

## గుంటూరు మెడికల్ కాలేజీలో అద్భుత ప్రదర్శన
## 85 వేల మంది సందర్శకుల్లో విద్యార్థులే అధికం

గుంటూరు నగరం సరికొత్త ఉత్సాహంతో ఊగిపోయింది. అటు విద్యార్థులు, ఇటు సామాన్య ప్రజలు అందరినీ ఒకే వేదికపైకి చేర్చి, మానవ శరీర రహస్యాలను కళ్ళకు కట్టినట్లు చూపించింది గుంటూరు మెడికల్ కాలేజీ. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత నిర్వహించిన ఈ భారీ వైద్య విజ్ఞాన ప్రదర్శన, ఒక ఎగ్జిబిషన్‌లా కాకుండా ఒక "వైద్య విజ్ఞాన మేళా"లా సాగింది.

జ్ఞానాన్ని పెంచుకోవడమే కాదు, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో కూడా నేర్పిన ఈ "మెడికల్ ఎగ్జిబిషన్" ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. 350కి పైగా ప్రదర్శనలు, వేలాది నమూనాలతో సాగిన ఈ విజ్ఞానయాత్ర విద్యార్థులు, యువతకు వైద్య విద్య, ఆరోగ్య పరిరక్షణ, సైన్సు గొప్పతనాన్ని వివరించింది.




GMC MedFusion పేరుతో గుంటూరు మెడికల్ కాలేజ్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన వైద్య విజ్ఞాన ప్రదర్శన విజయవంతమైంది. వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలు, ప్రజారోగ్య అవగాహన, శాస్త్రీయ అభ్యసనలను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ ప్రదర్శన సాగింది.

### వైద్య విజ్ఞాన ప్రదర్శన ప్రధాన లక్ష్యాలు

**ఆరోగ్య అవగాహన:** ఆరోగ్యం, వ్యాధి నివారణ, ఆరోగ్యకరమైన జీవనశైలిపై ప్రజల్లో అవగాహన కల్పించడం.

**విద్యా ప్రదర్శన:** గుంటూరు మెడికల్ కాలేజీ విద్యా పరిశోధనా సామర్థ్యాలను చాటిచెప్పడం.

**కెరీర్ మార్గదర్శకం:** విద్యార్థులు వైద్యం, ఆరోగ్య సంరక్షణ రంగాలలో తమ వృత్తిని (Career) ఎంచుకునేలా వారిని ప్రేరేపించడం.



**శాస్త్రీయ దృక్పథం:** యువ అభ్యాసకులలో శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని, జిజ్ఞాసను పెంపొందించడం.

**సామాజిక అనుసంధానం:** వైద్య శాస్త్రానికి సమాజానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం.





## విద్యార్థులే ఎక్కువ..

వైద్య విజ్ఞాన ప్రదర్శన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఒక గొప్ప విజ్ఞాన గనిగా మారింది. వేలాది మంది విద్యార్థులు తరగతి గదుల నుంచి బయటకు వచ్చి, వైద్య శాస్త్రంలోని అన్ని అంశాలను ప్రత్యక్షంగా చూసారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో ఎగ్జిబిషన్ కు రావడం, చాలా ఆసక్తిగా అన్ని విషయాలు తెలుసుకోవడం ఈ ఎగ్జిబిషన్ లక్ష్యం నెరవేరిందనడానికి నిదర్శనం.

## విజ్ఞాన జ్ఞాపకం..

అనాటమీ, పాథాలజీ, పీడియాట్రిక్స్, ప్లాస్టిక్ సర్జరీ, అనస్థీషియా విభాగాల ప్రదర్శనను అతి ఎక్కువ మంది చూశారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను ఎలా కాపాడాలో నేర్పే ప్రథమ చికిత్స (First Aid) విధానాలు తెలుసుకోవడం తమకు ఎంతో ఉపయోగపడిందని విద్యార్థులు చెప్పారు. ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగంలో నేర పరిశోధన తీరుతెన్నులను చూసి, తెలియని విషయాలు అడిగి తెలుసుకున్న విద్యార్థులు ఎంతో థ్రిల్ ఫీలయ్యారు. క్లినికల్ విభాగాల్లోని వైద్యులు విద్యార్థుల సందేహాలను ఎంతో ఓపికగా తీరుస్తూ వారిని ఎంతో ప్రోత్సహించారు. ఈ ప్రదర్శన ఓ సందర్శనలా కాకుండా, విద్యార్థులు భవిష్యత్తులో గొప్ప వైద్యులు కావాలనే బలమైన కోరికను, స్ఫూర్తిని కలిగించింది. 85 వేల మందికి పైగా సందర్శించిన ఈ విజ్ఞాన జాతర ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల జీవితాల్లో ఒక మరువలేని విజ్ఞాన జ్ఞాపకంగా నిలిచిపోయింది.



## ముప్పై ఏళ్ళ తర్వాత అరుదైన అవకాశం

గుంటూరు మెడికల్ కాలేజీలో ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఫిబ్రవరి 4వ తేదీన ఈ ప్రదర్శన ప్రారంభించారు. ఫిబ్రవరి 28 వరకు ఈ ఎగ్జిబిషన్ ఔత్సాహికులలో విజ్ఞాన కాంతులు నింపింది. సుమారు 30 ఏళ్ల తర్వాత ఇలాంటి ప్రదర్శన జరగడంతో, ప్రజల్లో ఆసక్తి నెలకొంది. దీనికి నిదర్శనం.. 85 వేలకు పైగా సందర్శకులు ఎగ్జిబిషన్ చూశారు. కాలేజీలోని 35కు పైగా విభాగాలు కలిసి 32 స్టాళ్లను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాయి.

## శరీరం లోపల ఏముంది ?

ఈ ప్రదర్శనలో అన్నిటికంటే ప్రధాన ఆకర్షణగా నిలిచింది 'అనాటమీ' (శరీర నిర్మాణ శాస్త్రం) విభాగం. సాధారణంగా మనం పాఠ్యపుస్తకాల్లో బొమ్మల రూపంలో చూసే గుండె, మెదడు, ఊపిరితిత్తులను ఇక్కడ నిజమైన మానవ అవయవాల నమూనాల రూపంలో చూసే అవకాశం లభించింది. మ్యూజియంలో ఉన్న వేలాది అరుదైన నమూనాలు సందర్శకులు చూసి అక్కడి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మన శరీరం లోపల ఇంతటి అద్భుతమైన వ్యవస్థ ఉందా అని ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయారు.

## వ్యాధుల గుట్టు రట్టు: పాథాలజీ పాఠాలు

వ్యాధులు మన శరీరాన్ని ఎలా దెబ్బతీస్తాయో పాథాలజీ విభాగం చూపించింది. క్యాన్సర్, క్షయ (TB) వంటి భయంకరమైన వ్యాధులు సోకినప్పుడు అవయవాల్లో వచ్చే మార్పులను నమూనాల ద్వారా వివరించారు. ఇది చూసిన తర్వాత ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరిలో ఒక అవగాహన కలిగింది. అనారోగ్యానికి గురైతే శరీరంలో ఏ మార్పులు జరుగుతాయో, ఏ సమస్యలు ఎదురవుతాయో, ఎన్ని ఇబ్బందులు పడాలో తెలుసుకున్నారు.

## అత్యవసర సమయంలో ప్రాణదాతలు: ఎమర్జెన్సీ మెడిసిన్

ప్రమాదం జరిగినప్పుడు డాక్టర్ దగ్గరకు వెళ్లేలోపు చేయాల్సిన ప్రథమ చికిత్స (First Aid) ప్రాముఖ్యతను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం వివరించింది. అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలి, ప్రాణాలను ఎలా కాపాడాలి అనే అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే పీడియాట్రిక్స్ విభాగం చిన్నారుల ఆరోగ్యం, టీకాల ప్రాముఖ్యతపై తల్లులకు విలువైన సూచనలు అందించింది.

## అందానికి మెరుగులు.. నొప్పి లేని సర్జరీ

ప్లాస్టిక్ సర్జరీ అంటే అందం కోసమే అనుకుంటారు చాలామంది. కానీ, కాలిన గాయాలు లేదా ప్రమాదాల వల్ల దెబ్బతిన్న శరీర భాగాలను తిరిగి ఎలా సాధారణ స్థితికి తీసుకురావచ్చో ప్లాస్టిక్ సర్జరీ విభాగం వివరించింది. ఇక శస్త్రచికిత్స సమయంలో అసలు నొప్పే తెలియకుండా చేసే అనస్థీషియా మాయాజాలాన్ని ఆ విభాగ వైద్యులు వివరించారు.

## సెల్ఫీ పాయింట్ వద్ద సందడి

ప్రదర్శనలో విజ్ఞానంతో పాటు వినోదం కూడా తోడైంది. కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఏర్పాటు చేసిన 'దోమతెర సెల్ఫీ పాయింట్' విద్యార్థులను విపరీతంగా ఆకర్షించింది. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించేందుకు చేసిన ఈ ప్రయత్నం అందరినీ ఆకట్టుకుంది. మురుగు నీటిని శుద్ధి చేసే విధానం సందర్శకులకు సరికొత్త విషయాలను తెలియజేసింది.

## ఫోరెన్సిక్ మెడిసిన్ రహస్యాలు

సినిమాల్లో చూసే క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్ ఎలా ఉంటుందో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం చూపించింది. ముఖ్యంగా ఎక్స్యూమేషన్ (పాతిపెట్టిన శవాన్ని తవ్వి పరీక్షించడం) ప్రక్రియను నమూనా రూపంలో చూపించడం సందర్శకులను ఒకింత భయానికి, మరెంతో కుతూహలానికి గురిచేసింది. న్యాయ వైద్య శాస్త్రం ఎంత కీలకమో ఈ స్టాల్ ద్వారా అర్థమైంది.

## భవిష్యత్తు వైద్యులకు ఒక దిశానిర్దేశం

గుంటూరు మెడికల్ కాలేజీ వేదికగా దాదాపు మూడు వారాలకు పైగా సందర్శకులతో కిటకిటలాడిన ఈ ఎగ్జిబిషన్ ఒక ప్రదర్శనలా మాత్రమే మిగిలిపోలేదు. ఎందరో విద్యార్థుల కలలకు, ఆశలకు ఊపిరి పోసింది. మానవ శరీరం, వ్యాధులు, ఆధునిక చికిత్సా విధానాలను ప్రత్యక్షంగా చూసిన విద్యార్థుల్లో వైద్య వృత్తి పట్ల గౌరవం, ఆసక్తి పెరిగాయి.

## ఆరోగ్య అవగాహన.. వైద్యవిజ్ఞానం పెరిగింది

"ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, విద్యార్థులకు వైద్య విజ్ఞానాన్ని పరిచయం చేయడమే ఈ ప్రదర్శన ప్రధాన ఉద్దేశం. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైద్య విద్యార్థులు, డాక్టర్లు, అధ్యాపకులు, ప్రజలకు కృతజ్ఞతలు. సహకరించిన ప్రభుత్వానికి, అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు"

– డాక్టర్ ఎన్.వి. సుందరాచారి,
*గుంటూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్*

– **అమలాపురపు దుర్గాప్రసాద్**, జర్నలిస్టు



# కరెంట్ అఫైర్స్

## అంతర్జాతీయం

### చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవం - అంతర్జాతీయం

ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 2న ప్రపంచ చిత్తడి నేలల పరిరక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటారు. చిత్తడి నేలల పరిరక్షణకు ఇరాన్ లోని రామ్ సర్ లో 1971లో ప్రపంచ దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ప్రపంచవ్యాప్తంగా చిత్తడి నేలలు భూ ఉపరితలంలో సుమారు 6% విస్తరించి ఉన్నాయి. ఇవి పర్యావరణ వ్యవస్థలకు మరియు జీవ వైవిధ్యానికి కీలకమైనవి. 2026కు గాను "చిత్తడి నేలలు మరియు మానవాళి మనుగడ సామాజిక వారసత్వాన్ని జరుపుకోవడం" థీమ్ గా పెట్టడం జరిగినది.

### భారత్ - అమెరికా వాణిజ్య ఒప్పందం

భారత్ – అమెరికా మధ్య చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా పారిశ్రామిక మరియు అమెరికా ఆహార వ్యవసాయ ఉత్పత్తులపై భారతదేశం సుంకాలను తొలగిస్తుంది. అదే సమయంలో భారత వస్తువులపై అమెరికా సుంకాలను 50 శాతం నుండి 18 శాతానికి తగ్గిస్తుంది. ఈ ఒప్పందం మూలాన భారతీయ ఉత్పత్తులు అమెరికాలో మార్కెట్ విస్తృతమవుతుంది.




### T20 ప్రపంచ కప్

భారత్ మరియు శ్రీలంక సంయుక్తంగా నిర్వహించనున్న u120 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7న ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ టోర్నీ ఫిబ్రవరి 7 నుండి మార్చి 8 వరకు జరుగుతుంది. టోర్నీలో 20 జట్లు పాల్గొంటున్నాయి. వీటిని నాలుగు గ్రూపులుగా విభజించి గ్రూప్ స్టేజ్ లో టాప్ 2 లో నిలిచిన జట్లు సూపర్ 8 దశకు చేరుకుంటాయి. అక్కడ రెండు గ్రూపులుగా విడిపోడి సెమీఫైనల్స్ కు పోటీపడతాయి. సెమీఫైనల్స్ లో గెలిచిన జట్లు మార్చి 8న ఫైనల్ లో అహ్మదాబాద్ లో నరేంద్ర మోడీ క్రికెట్ స్టేడియంలో కప్పు కోసం తలపడతాయి.



### బంగ్లాదేశ్ ఎన్నికలు - బి.ఎన్.పి విజయం

బంగ్లాదేశ్ లో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బి.ఎన్.పి) విజయం సాధించింది. బి.ఎన్.పి 212 స్థానాల్లో మిత్రపక్షాలతో కలిపి విజయం సాధించింది. బి.ఎన్.పి నేత తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటుకు సిద్ధమవుతుంది. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థి పార్టీ జమాత్–ఎ–ఇస్లామీ పార్టీ 70 సీట్లు గెలుచుకుంది. ఇంతకు ముందు రహ్మాన్ తల్లి అయిన ఖలేదా జియా బంగ్లాదేశ్ ప్రధాన మంత్రిగా రెండు సార్లు పనిచేశారు.

## జాతీయం


### అగ్ని-3 పరీక్ష విజయవంతం

ఒడిశాలో చాందీపూర్ లో ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్ నుండి ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణి అగ్ని–3 పరీక్ష విజయవంతంగా నిర్వహించారు. అగ్ని–3 స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేయబడిన క్షిపణి. ఈ క్షిపణి రెండు దశల ఘన ఇంధనంతో పనిచేస్తుంది మరియు 1500 కిలోల పేలోడ్ ను మోయగలదు. దీని యొక్క పరిధి 3000 – 3500 కి.మీ కలదు.



## చంద్రయాన్-4 ల్యాండింగ్ సైట్ - మోన్స్ మాటాన్

ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రుడి పై దక్షిణ ధ్రువ ప్రాంతంలోని Mons Mouton ను Chandrayaan-4 కోసం ల్యాండింగ్ ప్రాంతంగా గుర్తించారు. మోన్స్ మాటాన్ చంద్రుడి దక్షిణ ధ్రువానికి సమీపంలో ఉన్న సుమారు 6000 మీటర్ల ఎత్తైన పర్వతము. పర్వత శిఖరం ఎక్కువగా సమతలంగా ఉండటం వలన ల్యాండింగ్ కు అనుకూలంగా ఉంటుంది. చంద్రయాన్-4 మిషన్ ను సుమారుగా 2028 ప్రాంతంలో ప్రయోగించబడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.





## అండర్-19 వరల్డ్ కప్ లో ఇండియా జయకేతనం

అండర్-19 ప్రపంచ కప్ 2024 ఛాంపియన్స్ గా భారత్ అవతరించింది. ఫైనల్లో ఇంగ్లాండును భారత్ 100 పరుగుల తేడాతో ఓడించింది. దీనితో భారత్ మొత్తంగా ఆరుసార్లు U19 ప్రపంచ కప్ ను గెలుచుకుంది. మొదట భారత్ బ్యాటింగ్ చేసి 411 భారీ లక్ష్యాన్ని ఇంగ్లాండ్ ముందుంచింది. ఇంగ్లాండ్ 311 పరుగులకు ఆలౌట్ అయింది. టోర్నీ మొత్తం చెలరేగి ఆడిన వైభవ్ సూర్యవంశీ మరియు అర్షిత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మరియు సిరీస్ లభించాయి.

Pilloo

## Pilloo AI

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చిన్న మరియు మధ్య తరగతి వ్యాపారుల కోసం పిల్లూ ఏఐ యాప్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్ ఏఐ సహాయంతో వ్యాపారుల బిల్లులు, బ్యాలెన్స్ షీట్లు సులభంగా రూపొందిస్తుంది. ఈ యాప్ ఐదు భాషల్లో అందుబాటులో ఉంది.

## ఆంధ్రప్రదేశ్ లో భారతదేశంలోనే మొదటి గ్రీన్ యూరియా ప్లాంట్ - పుడిమడక

భారతదేశంలోనే తొలి భారీ స్థాయి గ్రీన్ యూరియా ప్లాంట్ ను ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో ఏర్పాటుకు NTPC Green Energy Limited మరియు అన్యాంగో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం N.G.E.L గ్రీన్ అమోనియాను, CO2, పునరుత్పాదక విద్యుత్ ను అన్యాంగోకు సరఫరా చేస్తుంది. అన్యాంగో వాటి నుండి గ్రీన్ యూరియాను ఉత్పత్తి చేస్తుంది. ఈ ప్రాజెక్టు మూలంగా ఎరువుల ఉత్పత్తిలో ఆత్మ నిర్భరతకు ఒక అడుగు ముందుకు పడుతుంది.



## అమరావతి క్వాంటం వ్యాలీ - భూమి పూజ

భారతదేశపు తొలి క్వాంటం టెక్నాలజీ హబ్ అయిన అమరావతి క్వాంటం వ్యాలీ స్థాపనకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారు శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టుకు ప్రభుత్వం 50 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ ప్రాజెక్టు ద్వారా లక్షలాది మంది యువతకు నైపుణ్య... శిక్షణతో పాటు, పెట్టుబడులు, ఉద్యోగ కల్పన జరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది.




( ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రాణనాడి హర్మూజ్ జలసంధి )

# సందర్భం

ప్రపంచ పటాన్ని ఒకసారి పరిశీలిస్తే, దేశాల మధ్య దూరాన్ని తగ్గించే సముద్ర మార్గాలు ఎన్నో కనిపిస్తాయి. కానీ, కొన్ని కిలోమీటర్ల వెడల్పు ఉండి, మొత్తం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గమనాన్ని శాసించే శక్తి గల జలమార్గాలు చాలా తక్కువ. అటువంటి వాటిలో అత్యంత కీలకమైనది హర్మూజ్ జలసంధి (Strait of Hormuz). ఒమన్, ఇరాన్ దేశాల మధ్య ఒక ఇరుకైన సందులా ఉండే ఈ జలమార్గం, నేడు ప్రపంచ దేశాల ఇంధన భద్రతకు ఒక ప్రధాన కేంద్ర బిందువుగా మారింది.

## భౌగోళిక ప్రాముఖ్యత – చరిత్ర

హర్మూజ్ జలసంధి భౌగోళికంగా ఉత్తరాన ఇరాన్, దక్షిణాన ఒమన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (UAE) మధ్య విస్తరించి ఉంది. ఇది పర్షియన్ గల్ఫ్‌ను, గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంతో కలిపే ఏకైక సముద్ర మార్గం. చమురు నిల్వలు పుష్కలంగా ఉన్న పర్షియన్ గల్ఫ్ దేశాల నుండి బహిరంగ సముద్రానికి చేరుకోవడానికి దీనికి మించిన మరో ప్రత్యామ్నాయం లేదు. చారిత్రక కోణంలో చూస్తే, ఈ జలసంధి శతాబ్దాలుగా వాణిజ్యానికి, సాంస్కృతిక సమ్మేళనానికి వేదికగా నిలిచింది. ప్రాచీన కాలంలో చైనా నుండి పట్టు, పింగాణీ, విలువైన వస్త్రాలు ఈ మార్గం ద్వారానే మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా వంటి ప్రాంతాలకు చేరేవి. ఆధునిక కాలానికి ముందే ఇది ఒక వ్యూహాత్మక జలమార్గంగా గుర్తింపు పొందింది.

## ప్రపంచ ఇంధన రక్షణ కవచం

నేడు ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే చమురు, సహజ వాయువులో 20% కంటే ఎక్కువ భాగం కేవలం ఈ హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. పర్షియన్ గల్ఫ్‌ను అంతర్జాతీయ జలాలతో అనుసంధానించే ఏకైక మార్గం కావడం వల్ల, ప్రపంచ ఇంధన భద్రతలో ఇది అనివార్యమైన పాత్ర పోషిస్తోంది. అందుకే, ఈ మార్గంలో నౌకల రాకపోకలు స్వేచ్ఛగా సాగేలా చూడటానికి అగ్రదేశాల నావికాదళాలు ఇక్కడ నిరంతరం నిఘా ఉంచుతాయి.

## భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు

ఈ జలసంధి ఎప్పుడూ ప్రశాంతంగా ఉండదు. ఇరాన్, పాశ్చాత్య దేశాల మధ్య నెలకొన్న రాజకీయ ఉద్రిక్తతలకు ఇది ప్రధాన వేదికగా మారింది. అంతర్జాతీయ ఒత్తిళ్లకు ప్రతిస్పందనగా ఈ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ పార్లమెంట్ గతంలో హెచ్చరించింది. గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడులు ప్రపంచ దేశాలను ఆందోళనకు గురిచేశాయి. ఒకవేళ ఈ మార్గంలో అంతరాయం కలిగితే, చమురు సరఫరా ఆగిపోయి, షిప్పింగ్ ఖర్చులు విపరీతంగా పెరిగే ప్రమాదం ఉంది.

## భారతదేశంపై దీని ప్రభావం ఎంత ?

హర్మూజ్ జలసంధిలో జరిగే ఏ చిన్న మార్పు అయినా భారతదేశంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనికి ప్రధాన కారణాలు:

* చమురు దిగుమతులు: భారతదేశం దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్‌లో సుమారు 40% ఈ జలసంధి ద్వారానే వస్తుంది.

* వంట గ్యాస్ (LPG): మన దేశంలో గృహ అవసరాలకు వాడే LPG లో దాదాపు 60% దిగుమతి చేసుకుంటున్నాము, అందులో అధిక భాగం ఈ మార్గం నుండే వస్తుంది. ఈ సరఫరా ఆగితే సామాన్యుడి వంటింట్లో మంట ఆగిపోయే ప్రమాదం ఉంది.

* సహజ వాయువు (LNG): ఖతార్ దేశం నుండి మనకు అందే సహజ వాయువులో సగభాగం ఈ మార్గం ద్వారానే చేరుతుంది. ఇది మన దేశంలోని ఎరువుల తయారీ, విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమలకు ఎంతో కీలకం.

హర్మూజ్ జలసంధి ఒక నీటి మార్గం మాత్రమే కాదు; అది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ జీవనాడి. ఇక్కడ నెలకొనే శాంతిపైనే అనేక దేశాల పురోగతి ఆధారపడి ఉంది. ముఖ్యంగా ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఆధారపడే భారతదేశం వంటి దేశాలకు, ఈ జలసంధిలో భద్రత, స్థిరత్వం అత్యంత అవసరం. ప్రపంచ దేశాలు సమన్వయంతో వ్యవహరించి, ఈ కీలక జలమార్గాన్ని వివాదాలకు దూరంగా ఉంచినప్పుడే అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన భద్రత సురక్షితంగా ఉంటాయి.

**అంతర్జాతీయ సంస్థలు**
**శాంతి క్రాంతికి వేదికలు**






యుద్ధం శాంతికి మార్గం చూపుతుంది. విధ్వంసం భవిష్యత్తు నిర్మాణానికి భద్రంగా ఉండాలని హెచ్చరిస్తుంది. ప్రపంచ శాంతికి.. క్రాంతికి కృషి చేసే సంస్థలు ఇటువంటి సంక్షోభ, సంక్లిష్ట సమయంలోనే పుట్టాయి.

## ఐక్యరాజ్యసమితి

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత.. ప్రపంచవ్యాప్తంగా శాంతిని నెలకొల్పే లక్ష్యంతో 1945లో ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ ఐక్యరాజ్యసమితి. ప్రస్తుతం 193 దేశాలు ఇందులో పూర్తి కాలపు సభ్యదేశాలుగా ఉన్నాయి. హోలీ సీ (పోప్ పరిధిలో ఉన్న ప్రాంతం), స్టేట్ ఆఫ్ పాలస్తీనా దేశాలు సభ్యత్వం లేకుండా ఇందులో కొనసాగుతున్నాయి.

ఐక్యరాజ్యసమితిలో గల ఆరు విభాగాల్లో సర్వసభ్య సభ ఒకటి. ఈ సంస్థ ఏం చేయాలనేది నిర్ణయించే ప్రధాన విభాగం ఇదే. ఐరాస సభ్యత్వం గల 193 దేశాలకూ ప్రాతినిధ్యం ఉన్న ఒకే ఒక్క విభాగమూ ఇదే.

ఈ సర్వసభ్య సభ వార్షిక సమావేశం ప్రతి ఏటా సెప్టెంబర్‌లో పక్షం రోజుల పాటు న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరుగుతుంది. ఈ సమావేశాల మధ్యలో నాలుగు రోజుల పాటు సాధారణ చర్చ ఉంటుంది.

## ఐక్యరాజ్యసమితి – విభాగాలు
## ఐక్యరాజ్యసమితిలో ఆరు ముఖ్యమైన సంస్థలు ఉన్నాయి. అవి:

1. సర్వప్రతినిధి సభ
2. భద్రతా మండలి
3. సచివాలయం
4. ధర్మ కర్తృత్వ మండలి
5. ఆర్థిక, సాంఘిక మండలి
6. అంతర్జాతీయ న్యాయస్థానం

## సర్వప్రతినిధి సభ

ఈ సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతిదేశానికి ఒక ఓటు ఉంటుంది. కొత్తగా సభ్యదేశాలకు ప్రవేశం కల్పించడానికి సర్వప్రతినిధి సభకు అధికారం ఉన్నది. ఈ సభ మూడింట రెండు వంతుల మెజారిటీతో నిర్ణయాలు చేస్తుంది.

## భద్రతా మండలి

ఐక్యరాజ్యసమితి ప్రారంభంలో ఇందులో 11 దేశాలున్నాయి, ప్రస్తుతం 15 దేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్య దేశాలు కాగా మిగతావి రెండేళ్ల కాలవ్యవధికి ఎన్నిక కాబడతాయి. అమెరికా, రష్యా, ఇంగ్లాండు, చైనా, ఫ్రాన్సు ఇందులో శాశ్వత సభ్యదేశాలు. వీటికి వీటో అధికారం కలదు. భద్రతా మండలికి ఆదేశాలను పాటించని రాష్ట్రాలు/దేశాలపై ఆంక్షలు మరియు సైనిక చర్య చేపట్టే అధికారమున్నది.

## ఆర్థిక సాంఘిక మండలి

ఇది సాధారణ సభ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ప్రజల విద్య, ఆరోగ్య, సాంస్కృతిక స్థాయి రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేస్తుంది.

అంతర్జాతీయ న్యాయస్థానం ఐక్యరాజ్యసమితి సభ్యుల న్యాయవివాదాలు ఈ సంస్థ విచారిస్తుంది. దీని యొక్క కేంద్రం హేగ్ లో కలదు. ఈ న్యాయస్థానంలో 15 మంది న్యాయమూర్తులు ఉంటారు. వారి పదవీకాలం 9 సంవత్సరాలు ఉంటుంది.

## సచివాలయము

ఇది ఐ.రా.స వ్యవహారాలు నిర్వహించే కార్యనిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్కు లో కలదు. సచివాలయానికి ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు.

## ఐక్యరాజ్యసమితి – సమస్యలు

ఐక్యరాజ్యసమితి యొక్క భద్రతా మండలి సభ్యులు వీటో అధికారాన్ని దుర్వినియోగము చేస్తూ ముఖ్యమైన నిర్ణయాలను అడ్డుకుంటున్నారు. 1945 లో ఐ.రా.స ఏర్పాటు తర్వాత 80 సంవత్సరాల తరువాత కూడా భద్రతా మండలిలో మార్పులు జరగలేదు. భద్రతా మండలిలో ఆసియా మరియు ఆఫ్రికా దేశాల ప్రాతినిధ్యం సరిగా లేదు. ఐ.రా.స సభ్యదేశాల మధ్య ఘర్షణలను నివారించడంలో విఫలమైంది.

## ఐ.రా.స – మార్పులు అవసరం

భద్రతా మండలిలో ప్రస్తుతమున్న P5 స్థానాలకు బదులుగా, అభివృద్ధి చెందుతున్న దేశాలు మరియు మారుతున్న ప్రపంచ సమీకరణాలకు అనుగుణంగా భారత్, జర్మనీ, బ్రెజిల్ లాంటి దేశాలకు శాశ్వత సభ్యత్వ అవకాశం కల్పించాలి. వీటో అధికారాన్ని అత్యయిక సమయానికి మాత్రమే ఉపయోగించేలా పరిమితం చేయాలి. భద్రతా మండలిలో తాత్కాలిక సభ్యులను పెంచాలి.

## ఐక్యరాజ్యసమితి – భారతదేశ పాత్ర

ఐక్యరాజ్యసమితికి భారతదేశం విశేషమైన సేవలు అందించింది. భారతదేశం ఐ.రా.స శాంతి మరియు భద్రతా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటుంది. శాంతి భద్రతా కార్యక్రమాల కోసం భారతదేశం 2 లక్షల కంటే ఎక్కువ సైనికులను పంపింది. ఐక్యరాజ్యసమితికి భారతదేశం ఆర్థికంగా అత్యధికంగా సహకారాన్ని అందిస్తోంది. భారతదేశం ఐక్యరాజ్యసమితి స్థాపక సభ్యదేశాలలో ఒకటి మరియు 1945 నుండి సభ్యదేశంగా ఉంది. ప్రపంచ శాంతిని కోరే దేశంగా భారతదేశానికి భద్రతా మండలిలో ప్రాతినిధ్యం అత్యవసరం.

– **వావిలపల్లి భార్గవ** (ఐఆర్ఎంఎస్– ట్రైనీ)







## బొమ్మ గీశానోచ్!




– **జి.సారిక,** 5వ తరగతి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జి.వి.రామేశ్వరం, సఖినేటిపల్లి, అంబేద్కర్ కోనసీమ జిల్లా, +91 98666 24420



– **కొల్లు మేఘన,**
మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల,
గుమ్మడి వారి పాలెం , అయినవిల్లి మండలం





– **చింతపల్లి ప్రవీణ్,** 7వ తరగతి,




– **సి. రోషిణి ,** 9వ తరగతి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, సంజయ్ గాంధీ నగర్, చిత్తూరు జిల్లా.

## రంగులు వేయండి



# చుక్కలు కలపండి



# బాల్యం

ఒక తీపి జ్ఞాపకం
కొన్ని అద్భుత స్మృతులు
కల్మషం లేని మనసులు
కొన్ని ఆటల సందల్లు
మరికొన్ని గాయాల శబ్దాలు
కోకిల కిలకిల రావాలు
చందమామ పిలుపులు
అమ్మ చేతి గోరుముద్దలు
అమ్మమ్మ కాళ్ల మీద లాలి
నాన్న గుండెల మీద తపటడుగులు.
ఇన్ని మరువలేని మననాలు
మనం ఏమి ఇస్తే తిరిగి వస్తాయి?
ఎంత ఖర్చు చేస్తే మనల్ని మళ్లీ వెనక్కి
తీసుకవెడతాయి?
మనకు నచ్చిన మన గతానికి
మనం ఎన్నడూ చేరుకోలేము ఇన్నిన్ని
ప్రీతికరమైన గుర్తుల్ని మరువగలమా?
బడికి వెళ్లమని ఉరకలు వేసిన సందులు ఎన్నో
ఉరకలు వేస్తూ దెబ్బలు తిన్న రోజులు ఎన్నో
పలక మీద బలపంతో 'అ' అన్న అక్షరాన్ని
అమ్మతో దిద్దిన రోజు నుంచి
అమ్మకు ఆంగ్లం నేర్పే రోజుకు ఎదిగాము
ఎన్నెన్ని వర్ణాలు వర్ణించినా
ఎన్నెన్ని స్మృతులను గుర్తించినా
మనం ఎప్పటికి తిరిగి వెళ్లలేని దేశం
బాల్యం అనే ప్రదేశం
తీపి జ్ఞాపిల స్వదేశం
ప్రేమ వర్ణాల విదేశం

– ***కె.సాయి యామిని,*** *9వ తరగతి, రావికంపాడు, తొండంగి మండలం, కాకినాడ జిల్లా, 81214 15323*

# కాలం విలువ-కథ

ఒక ఊరిలో ఒక గవర్నమెంట్ పాఠశాల ఉండేది. పాఠశాలకు ఊరిలో ఉన్న పిల్లలందరూ వెళుతూ ఉండేవారు. అందులో రవి అనే ఒక అబ్బాయి ఐదో తరగతి చదువుతున్నాడు. ఆ అబ్బాయికి బద్ధకం చాలా ఎక్కువ. చదువుపై అసలు ఆసక్తి చూపడు. మిగతా పనికిమాలిన విషయాలన్నింటిపై ఆసక్తి బాగా చూపుతూ పనులు చేస్తుంటాడు. కాలక్రమేనా ఆ అబ్బాయి పదవ తరగతికి వచ్చేసాడు. అయినా బుద్ధిలో ఎటువంటి మార్పు లేదు.

ఒకరోజు ప్రధానోపాధ్యాయుల వారు తరగతి గదికి వచ్చి, పిల్లలతో కొద్ది రోజుల్లో మన పాఠశాల వార్షికోత్సవం రాబోతుంది. కాబట్టి మీరు పాటలు, డాన్సులు నేర్చుకోండి అని చెప్పి వెళ్ళిపోయారు.పిల్లలందరూ అన్ని నేర్చుకున్నారు. ఆరోజు రానే వచ్చింది. ఆ రోజున పాఠశాలకు ఊరిలో నున్న గ్రామ పెద్దలు, ప్రజలు ఆ వార్షికోత్సవాన్ని చూడటానికి వచ్చారు. ఈ పాఠశాల వార్షికోత్సవానికి డిఇఓ గారిని కూడా ప్రధానోపాధ్యాయులవారు ఆహ్వానించడం జరిగింది. అతను ఆహ్వానం మేరకు డిఇఓ గారు కూడా వచ్చారు. పిల్లలందరూ పాటలు చక్కగా పాడారు. చివరికి డి ఈఓ గారు మాట్లాడవలసిన సమయం వచ్చింది. మాట్లాడుతూ.. మాట్లాడుతూ చివరలో పిల్లలని దృష్టిలో పెట్టుకొని ఒక మాట అన్నారు. "శ్రమ నీ ఆయుధం అయితే విజయం నీకు బానిస అవుతుంది'ని అన్నారు. "తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చదవమంటున్నారు కదా ..చదువుతానులే అనే భావన తో చదవకండి. ఆ భావన నీ మనసులో నుంచి రావాలి. నేను బాగుపడాలి. నా తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి. నేను పది మందికి ఆదర్శంగా మారాలి.. నా మంచిభవిష్యత్తు కోసం నేను చదువుకోవాలి అనే భావన మనసులో నుంచి రావాలి. అంతేకాకుండా చదివేటప్పుడు కాలం విలువ తెలుసుకొని, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి. అప్పుడు చూడండి! చదివింది ఎందుకు రాదని మీకే తెలిసిపోతుంది."అని తెలియజేసి, డి ఈఓ గారు వెళ్లిపోవడం జరిగింది. తాను మాట్లాడిన ప్రతి మాట రవి గుండెల్లో నాటుకి పోయింది.

పశ్చాత్తాపము పడుతూ ఆరోజు నుండి రేయింబవళ్ళు కష్టపడిన రవికి మంచి మార్కులతో పదవ తరగతి పాస్ అవ్వడం అనేది జరిగింది. రవి ని చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఎంతో మురిసిపోయారు.

అలానే ఇంటర్ పూర్తి చేసి, మంచి ఎంసెట్ ర్యాంక్ తో బీటెక్ కూడా పూర్తి చేశాడు. అందులో కూడా మంచి మార్కులతో పాస్ అయ్యాడు రవి. అదే విధంగా మంచి సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం కూడా వచ్చింది. మంచి జీతం తో పనిచేస్తూ ఎందరికో ఆదర్శమయ్యాడు రవి. బెంగళూరులో పనిచేస్తున్న రవి కొన్ని రోజులు సెలవు మీద తన గ్రామం రావడం జరిగింది. తను వచ్చిన సమయంలోనే ఆ ఊరి పాఠశాలలో వార్షికోత్సవ సంబరాలు జరుగుతున్నాయి. తను చదివినప్పుడు వచ్చిన డి ఈ ఓ గారిని, అతని రిటైర్మెంట్ అనంతరం అదే పాఠశాలకి అతిథిగా పిలిచి, సన్మాన కార్యక్రమం పెట్టుకున్నారు. డి ఈ ఓ గారి ఫొటోని కటౌట్ మీద చూసి వార్షికోత్సవానికి రవి రావడం జరిగింది.

డీఈఓ గారి సన్మాన కార్యక్రమం జరుగుతున్న సమయంలో ప్రధానోపాధ్యాయుల వారి అనుమతి మేరకు తాను కూడా డీఈవో గారిని సన్మానిస్తూ.. తన గతాన్ని స్టేజి మీద సభా ముఖంగా అందరికీ తెలియజేశాడు. నా పేరు రవి అయినా నాలో జ్ఞానం అనేది అసలు ఉండేది కాదు. మన డి ఈ ఓ గారు ఆరోజు పిల్లలందరినీ ఉద్దేశించి ఒక మాట అన్నారు. 'చదువడమనేది ఎవరికోసమో చదవకండి. మీ మంచి భవిష్యత్తు కోసం, కష్టపడి కాకుండా ఇష్టపడి చదవండి. అప్పుడే మీ భవిష్యత్తు బంగారమైమవుతుంది.' ఆ మాట నా మదిలో శిలక్షరాలై నిలిచాయి. ఆ మాటే ఈరోజు నన్ను ఒక ఉన్నత స్థితిలోని నిలబెట్టింది. అంతేకాదు అతని మాటలకి జ్ఞానోదయమై స్నేహితులు ఎందరో గ్రూప్ వన్, గ్రూప్ టు ఆఫీసర్లుగా ఎంపిక అయ్యారు.మీకు వేవేలా వందనాలు సార్. ఇదే సందర్భంలో నేను కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నాను కనుక ఈ పాఠశాల రుణం తీర్చుకోవడానికి నా తరపున గ్రంథాలయ నిర్మాణానికి ఒక 50,000 వేలు రూపాయలను మన డీఈవో గారి చేతుల మీదుగా అందజేస్తున్నాను.

ఈ సందర్భంగా పిల్లలందరికీ నేను ఒకటే విషయం చెబుతున్నాను. కాలం చాలా విలువైనది ప్రతి పనిని రేపు చేస్తాను అని వాయిదా వేయకండి. గురువులైన తల్లిదండ్రులైన మన మేలు కోసం మాత్రమే చెప్తారు. కాలాన్ని వృధాగా గడపకండి." అంటూ పెద్దలందరికీ పాదాభివందనాలు చేసి ఒక ఆదర్శ వ్యక్తిగా నిలిచాడు రవి.

– ***మహంతి తపస్వీ,*** *9వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అర్తమూరు గ్రామం, గరివిడి మండలం, విజయనగరం జిల్లా*



# వారసుడు

## (The Legacy of Dalapati)

తేది: ఫిబ్రవరి 15, 2026. ప్రాంతం: వైజాగ్

విశాఖపట్నంలోని 'ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల', ఎప్పటిలాగే సందర్శకులతో కళకళలాడుతోంది. కానీ, ఆ రోజు హిప్పోల ఎన్‌క్లోజర్ వద్ద సందడి కొంచెం ఎక్కువగా ఉంది.

నీటిలో మునిగి, అప్పుడప్పుడు బయటకు కనిపిస్తున్న, ఓ రెండు జీవుల మీదే సందర్శకులందరి చూపు!

అవి మరేరో కాదు, తల్లి పద్మ, దాని ముద్దుల బిడ్డ జూనియర్ దళపతి. నీటి అడుగున ప్రశాంతంగా ఉన్న పద్మను తన చిన్న కాళ్ళతో తట్టింది జూనియర్ దళపతి.

"అమ్మా! పైన చూడు ఎంతమంది మనుషులు ఉన్నారో! అందరూ మనల్నే చూస్తున్నారు. ఎందుకని?" ఆశ్చర్యంగా అడిగింది.

పద్మ నవ్వి, తన బిడ్డను ప్రేమగా చూస్తూ ఇలా అంది, "వాళ్ళు కేవలం మనల్ని చూడటానికి రాలేదు నాన్నా, నీలో మీ నాన్నగారిని చూసుకోవడానికి వచ్చారుని చెప్పింది!

"నాన్నగారా?" అంటూ, జూనియర్ దళపతి చెవులు రిక్కించింది. "అవును! మీ నాన్నగారు 'దళపతి'. ఆయన పేరు చెబితేనే ఈ జూలో ఒక గంభీరమైన వాతావరణం ఉండేది.

ఆయన ఈ నీటి కోటకి రారాజు. ఎంతో బలవంతుడు. అంతకు మించి చాలా శాంత స్వభావం కలవాడు. ఆయనలాగే నువ్వు కూడా ఎదగాలని, అందరూ నిన్ను ప్రేమగా 'జూనియర్ దళపతి' అని పిలుస్తున్నారు," అని తల్లి పద్మ గర్వంగా చెప్పింది. ఆ మాటలు విన్న జూనియర్ దళపతికి మొదట కొంచెం భయమేసింది.

"అమ్మా, నాన్నగారు అంత గొప్పవారా? మరి నేను ఆయనలా ఉండగలనా? నేను ఇంకా చిన్నపిల్లాడిని కదా!" అని సందేహంగా అడిగింది.

ఒక్కసారిగా, పద్మ తన బిడ్డను నీటిపైకి తీసుకువచ్చింది.

సూర్యకిరణాలు వాటి తడిసిన చర్మంపై పడి మెరుస్తున్నాయి. సందర్శకులు ఆ దృశ్యాన్ని చూసి చప్పట్లు కొట్టారు.

చూడు నాన్నా, "గొప్పతనం అనేది ఆకారంలో ఉండదు, మనం ఉండే విధానంలో ఉంటుంది.

మీ నాన్నగారు ఎంత బలవంతుడైనప్పటికీ, ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవారు.


నువ్వు కూడా ధైర్యంగా – ఆరోగ్యంగా ఎదిగి, ఈ విశాఖ జూ కీర్తిని పెంచాలి. నువ్వు కేవలం హిప్పోవి కాదు, 'దళపతి' వారసుడివి' అని తన తల్లి ధైర్యం చెప్పింది!

అమ్మ మాటలతో జూనియర్ దళపతిలో కొత్త ఉత్సాహం వచ్చింది. అది నీటిలో ఒక్కసారిగా మునిగి పైకి లేచి, తన చిన్ని నోరు తెరిచి ఒక గంభీరమైన పోజు ఇచ్చింది. అది చూసి తల్లి పద్మ మురిసిపోయింది.ఆ రోజు నుంచి జూనియర్ దళపతికి అర్థమైంది, తాను సామాన్యుడిని కాదని, ఒక గొప్ప రాజుకు వారసుడనని! సందర్శకుల కేరింతల మధ్య, అమ్మ పద్మ రక్షణలో 'జూనియర్ దళపతి' తన ప్రయాణాన్ని సగర్వంగా మొదలుపెట్టాడు.

ఇక అప్పటి నుండి.... జూనియర్ దళపతి, విశాఖ జూకి కొత్త ఆకర్షణగా మారాడు!

*నీతి: వారసత్వం అంటే ఆస్తిపాస్తులు కాదు, బాధ్యత మరియు ధైర్యం!*
*"హిప్పోలను రక్షించడం అంటే, మన నీటి వనరులను కాపాడుకోవడమే".*

– ఆర్వీటీ



# హిప్పోపోటామస్
## ఒక వింతైన జీవి

హిప్పోపోటామస్ అనే పదం 'గ్రీకు' భాష నుండి వచ్చింది. 'హిప్పో' అంటే గుర్రం, 'పోటామస్' అంటే నది. అంటే దీని అర్థం 'నది గుర్రం'. ఇవి ఆఫ్రికా ఖండానికి చెందిన ఒక రకమైన శాకాహార జంతువులు. ఏనుగు, తెల్ల ఖడ్గమృగం తర్వాత భూమిపై ఉన్న మూడవ అతిపెద్ద జంతువు హిప్పోనే. ఒక మగ హిప్పో సుమారు 1,500 నుండి 3,000 కిలోల బరువు ఉంటుంది. హిప్పోలు గుంపులు గుంపులుగా జీవిస్తాయి. ఒక గుంపులో 10 నుండి 30 వరకు హిప్పోలు ఉంటాయి. ఈ హిప్పోల గుంపును 'బ్లోట్' (Bloat) అని పిలుస్తారు.

ఒక రోజు మొత్తమ్మీద హిప్పోలు, దాదాపు 16 గంటలు నీటిలోనే గడుపుతాయి. దీనివల్ల వాటి శరీరం చల్లగా ఉంటుంది.

పగలంతా నీటిలో ఉండి, రాత్రి వేళల్లో గడ్డి మేయడానికి భూమిపైకి వస్తాయి. ఒక రాత్రిలో ఇవి సుమారు 35 నుండి 40 కిలోల గడ్డిని తింటాయి. వీటి చర్మం చాలా మందంగా ఉంటుంది. ఎండ నుండి రక్షణ కోసం వీటి శరీరం ఒక రకమైన ఎర్రటి ద్రవాన్ని (Blood sweat) స్రవిస్తుంది. ఇది సన్ స్క్రీన్ లాగా పనిచేస్తుంది.

ఇది సూర్యుని అతినీలలోహిత కిరణాల నుండి చర్మాన్ని రక్షించడమే కాకుండా, చర్మంపై బ్యాక్టీరియా పెరగకుండా యాంటీబయోటిక్ లాగా పనిచేస్తుంది. ఇదొక 'అద్భుతమైన శరీరధర్మమే' అని చెప్పొచ్చు.

హిప్పోలు తిమింగలాలు (Whales) మరియు డాల్ఫిన్లకి దగ్గరి చుట్టాలు. దాదాపు 6 కోట్ల సంవత్సరాల క్రితం 'ఆంత్రాకోథీర్స్' (Anthracotheres) అనే జంతువుల నుండి ఇవి విడిపోయాయట.

హిప్పోల పాలు 'గులాబీ రంగు'లో ఉంటాయి.

కారణం, Hipposudoric acid & Norhipposudoric acid.

ఆఫ్రికా ఖండం బయట, ప్రపంచంలోనే అత్యధిక హిప్పోలు ఉన్న దేశం కొలంబియా!

ఇవి అక్కడి స్థానిక పర్యావరణాన్ని మార్చేస్తున్నాయటా. అందుకే వీటిని శాస్త్రవేత్తలు "Invasive Species" (దురాక్రమణ జాతులు) గా ప్రకటించారు.

– **టి. వెంకటరమణ** *తొడుము, కొమరాడ మండలం*
*పార్వతీపురం మన్యం జిల్లా ఫోన్ : 62817 41594*





# వ్యాయామ విద్య - నైపుణ్యాల వర్గీకరణ (ఆటలు – క్రీడలు)

పిల్లల సంపూర్ణ వికాసమే విద్య లక్ష్యం. వ్యాయామ విద్య ద్వారా పిల్లల శారీరక, మానసిక వికాసం కలుగుతుంది. ఆటలు ఆనందం కలిగించడమే కాకుండా ఆరోగ్యానికి తోడ్పడాలి. అందుచేత ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు సరైన శిక్షణ నివ్వాలి. ప్రాథమిక పాఠశాల స్థాయిలో పొందిన వ్యాయామ విద్య జ్ఞానానికి కొనసాగింపుగా ఉన్నత పాఠశాల స్థాయిలో కార్యక్రమాలు రూపొందించి అమలు చేయాలి. ఉన్నత నైపుణ్యవంతమైన శారీరక కదలికలను నేర్చుకొని ఆటల ద్వారా ఆరోగ్యవంతులైన, ఆహ్లాదకరమైన జీవితాన్ని పొందటం, భవిష్యత్తు క్రీడాకారులను తయారుచేయుటకు అవసరమైన పునాదిని ఏర్పాటు చేయు ప్రక్రియను వ్యాయామ విద్య – నైపుణ్యాల వర్గీకరణ.

విద్యార్థులందరికీ వ్యాయామ విద్య ప్రాథమిక స్థాయి నుండి అందించినట్లయితే వారిలో చలన నైపుణ్యాలు (Fundamental Movement Skills) వృద్ధి చెంది, క్రీడలతో ఉత్తమ నైపుణ్యాన్ని సంపాదించి మంచి క్రీడాకారులుగా తయారగుటకు దోహదపడుతుంది. క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించాలంటే విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుండి చలన నైపుణ్య కృత్యాలలో పటుత్వం సాధించినప్పుడు మాత్రమే ఉత్తమ ఫలితాలను సాధించగలం ఆ ద్వారా ఆంధ్రప్రదేశ్ ను క్రీడలలో అగ్రభాగాన నిలపగలం.

## పిల్లల్లో పెరుగుదల – అభివృద్ధి

1. భౌతికంగా (శారీరకంగా)
2. మానసికంగా (మనస్సు, బుద్ధి వికాసంలో)
3. ఉద్వేగపూరితమైన (భావపూరితమైన వ్యక్తీకరణలో)
4. సాంఘికంగా (ఇతరులతో తమ సంబంధం)

పిల్లల పెరుగుదల అభివృద్ధికి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, పుట్టుకకు ముందు పరిస్థితులు, తల్లులకు అందే పోషకాహారం, అనువంశిక వారసత్వాలు, పరిసరాల ప్రభావము, సాంఘిక, ఆర్థిక పరిస్థితుల వంటివి.

## పిల్లల పెరుగుదల – అభివృద్ధి దశలు

1. **నవజాత శిశువు దశ:** 0 నుండి – 4 వారాల వరకు
2. **శిశువు దశ:** 1 నెల నుండి 1 సంవత్సరం వరకు
3. **టాడ్లర్ దశ:** 1 సంవత్సరం నుండి 3 సంవత్సరాలు
4. **పాఠశాల పూర్వ దశ:** 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాలు
5. **ప్రాథమిక విద్యార్థి దశ:** 5 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలు
6. **కౌమార దశ:** 10 సంవత్సరాల నుండి 19 సంవత్సరాలు

ప్రాథమిక విద్యార్థి దశ : ఈ దశలో సంవత్సరానికి సుమారు 2.3 కి.గ్రా బరువు, 5.3 సెం.మీ. నుంచి 7 సెం.మీ ఎత్తు పెరగవచ్చునని కొన్ని గణాంకాలు సూచిస్తున్నాయి. బడిలో సాంఘిక పరిచయాలను విస్తృతపరుచుకొనుట, మానసిక నైపుణ్య అభివృద్ధి చేసుకొనుట జరుగును. సంఘంలో ఉపయోగకరమైన సభ్యుడిగా అభివృద్ధి చెందును. ఈ దశయందు కొంతకాలం అభివృద్ధి వేగవంతంగా నుండి, మరికొంతకాలం అభివృద్ధి మందగిస్తుంది.



గమనిక : ఈ పట్టిక అనుసరించి విద్యాసంవత్సరం ప్రారంభంలో ఒకసారి, పాఠశాల విద్యాసంవత్సరం చివరిలో ఒకసారి విద్యార్థుల బరువు, ఎత్తులను నమోదు చేసుకోవలెను. అలా చేయుట ద్వారా పిల్లలలో పెరుగుదలను గుర్తించవచ్చును.

...వుంటే వారి కదలికలలో అభివృద్ధి జరగదు. తరగతి గదిలో గాని, ఇంటివద్ద గాని ఎక్కువ సమయం కూర్చోకుండా వారిని ఆడించడానికి, కదలడానికి ప్రోత్సహించాలి. పాఠశాలలో ఆటల పీరియడ్స్ లోనే కాకుండా ఇతర విషయముల పాఠ్యాంశాలు కూడా ఆటల కదలికలతో మిళితం చేసి చెప్పాలి. కదలికలతో కూడిన పాటలు, రైమ్స్ ఎక్కువ ప్రోత్సహించాలి.

## అభ్యాస వయస్సు (6–9 సం॥ బాలురు, 6–8 సం॥ బాలికలు):

ఈ వయస్సు పిల్లలు అప్పటికే నడవడం, పరుగెత్తడం, ఎగరడం నేర్చుకొని వుంటారు కనుక వీరి కదలికలకు మూలాధారమైన సమతుల్యమునకు సంబంధించిన అంశాలు కంటిచూపు, కాళ్ళ చేతుల మధ్య సమన్వయాన్ని ప్రోత్సహించే అంశాలు, వేగాన్ని అభివృద్ధి చేసే అంశాలు. అవసరానికి అనుగుణంగా కదిలే మార్గాలను త్వరత్వరగా మార్చగలిగే అంశాలను నేర్పి పిల్లల ఆత్మవిశ్వాసాన్ని వృద్ధి చేసే దిశగా కార్యక్రమాలని రూపొందించాలి. ఎగరడం, దూకడం, పరుగెత్తడం, విసరడం, విసిరిన వాటిని పట్టుకోవడం, కాళ్ళతో తన్నడం వంటి నైపుణ్యాలతో పాటు, ఇవే నైపుణ్యాలను వీలైనన్ని చిన్న చిన్న ఆటలలో మిళితం చేసి ఆడే అవకాశం కల్పించాలి.

పెంకులు, ఇటుకలు, చిన్నచిన్న రాళ్ళు, పాత బట్టలు, పుస్తకాలు, పుస్తకాల సంచులు అలా ఏ వస్తువు అందుబాటులో వుంటే వాటిని ఈ కార్యక్రమంలో వాడవచ్చు. ఏ వస్తువుగాని,

సామాగ్రిని ఏ నేలను వాడినా పిల్లలకు ప్రమాదం జరుగకుండా, గాయాలు కాకుండా ఉండే జాగ్రత్తలు తీసుకోవాలి.

### ప్రాథమిక క్రీడా శిక్షణ (9-12 సం॥ బాలురు, 8-11 సం॥ బాలికలు) :

సహజంగా ఈ వయస్సు బాలబాలికలలోని ఎదుగుదలలో వ్యత్యాసము, వారి వారి సామర్థ్యాల మధ్య వ్యత్యాసం కనిపిస్తుంది. ఈ వయస్సు పిల్లలను ప్రాథమిక కదలికలు నేర్పడంతో పాటు క్రీడాంశాలలో కూడా పరిచయం చేయాలి. ఆ నైపుణ్యాలను ఉత్సాహంగా నేర్చుకోవడానికి, వాటికి సంబంధించిన లీడప్ ఆటలను (Lead-up games) ఆడించాలి.

### ప్రాథమిక చలన నైపుణ్య దశలు

1. సమతుల్య నైపుణ్యాలు (Balance skills)
2. గమన నైపుణ్యాలు (Locomotion skills)
3. వస్తు నియంత్రణ నైపుణ్యాలు (Manipulative skills)

2.3 చలన నైపుణ్య ప్రయోజనాలు : ఈ ఆటల ద్వారా విద్యార్థులలో వినోదం, దేహదారుఢ్యం, విధేయత, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం, పట్టుదల, జట్టుగా అందరు కలిసిమెలిసి ఉండటం వంటి గుణాలను పెంచాలి.

### కదలికల నైపుణ్యాలు

మానవుని కదలికలు తల్లి గర్భంలోనే ప్రారంభమగును. పిల్లలు వారు నేర్చుకున్న ప్రతి కదలిక నుండి ఆత్మవిశ్వాసం పొందుతూ తన చుట్టూ వున్న పరివారం, పరిస్థితుల నుండి కొత్త కొత్త విషయాలను నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటారు.

### సహజ సిద్ధమైన కదలికలు

1. నిలబడుట
2. కూర్చునుట
3. నడుచుట
4. పరుగెత్తుట
5. వెనుకకు నడుచుట
6. గెంతుట, దూకుట

ఆటలాడదాం, ఆనందంగా ఆరోగ్యంగా జీవిద్దాం

### ఆటలు-వర్గీకరణ :

1. టార్గెట్ గేమ్స్ - గురి ప్రధాన అంశంగా ఉన్న క్రీడలు (విలు విద్య, క్యారమ్స్, షూటింగ్...).
2. దాడి క్రీడలు - వారి గోల్స్ ను రక్షించుకుంటూ ప్రత్యర్థి గోల్ పై దాడి చేయడం (ఫుట్ బాల్, హాకీ...).
3. స్ట్రయిక్ & ఫీల్డ్ గేమ్స్ - (క్రికెట్, బేస్ బాల్...).
4. నెట్ సంబంధిత క్రీడలు - (బ్యాడ్మింటన్, వాలీబాల్, టెన్నిస్...).
5. వ్యక్తిగత సామర్థ్య క్రీడలు - (అథ్లెటిక్స్, స్విమ్మింగ్, కరాటె...).

### వ్యాయామ ఉపాధ్యాయుని పాత్ర : Role of Physical Education Teacher

* అందరు విద్యార్థులను సమాన భావనతో చూడాలి.

* వ్యాయామ కార్యక్రమాలు ఎందుకు అనేది విద్యార్థికి, వారి తల్లిదండ్రులకు తెలియజేయాలి.

* ఉపాధ్యాయుడు చిరునవ్వుతో అందరిని ఉత్సాహపరుస్తూ ప్రోత్సహించాలి.

### చాలక సామర్థ్యాలు :

1. బలము (Strength)
2. వేగము (Speed)
3. శక్తి సామర్థ్యం (Endurance)
4. ఫ్లెక్సిబిలిటీ (Flexibility)
5. చురుకుదనం (Agility)

- యోగ పూర్ణ
వ్యాయామ నిర్దేశకుడు యోగ స్టేట్ రిసోర్స్ పర్సన్ 9951635035





समग्र शिक्षा
Samagra Shiksha
సమగ్ర శిక్షా

## Scan the QR Code & Follow Samagra Shiksha

**Samagra Shiksha Official (AP)**

Official entity of Department of School Education, Govt. of Andhra Pradesh

- Samagra's Official WhatsApp Channel
- Samagra's Official YouTube Channel
- Samagra's Official Instagram Page
- Samagra's Official Facebook Page
- Samagra's Official X (Twitter)
- Samagra's Official LinkedIn Page

One stop for official Announcements & Initiatives from Andhra's Education Department

Published by the **State Project Director**, Samagra Shiksha, Andhra Pradesh. K.B.C ZillaParishad High School (Boys) Premises, High School Road, Patamata, Vijayawada - 520 010. A.P. For mail: manabadimagazine@gmail.com, manabadimagazine@apschooledu.in, Present : **B.Srinivasa Rao,** I.A.S., Printed by : **M/s. Lakshmi Vignesh Printers,** Guntur